## క్లుప్తంగా

### అప్సా ఆర్థిక కార్యదర్శిగా రఫీ

**పామర్రు:** ఏపీ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ (అప్సా) ఉమ్మడి కృష్ణా, ఏలూరు జిల్లాలకు ఆర్థిక కార్యదర్శిగా పామర్రు మండలం జుఝవరం గ్రామంలోని ఉషోదయ హైస్కూల్ ప్రిన్సిపల్ ఎండీ రఫీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రఫీ మాట్లాడుతూ ఈ నెల 11 న నూజివీడులోని త్రివిధ హైస్కూల్లో అప్సా ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారని తెలిపా. ఈ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శితో పాటు ఆర్థిక కార్యదర్శి ఎంపిక జరిగిందన్నారు. రఫీని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించారు.

### ఆర్‌బీకేలలో ఈ క్రాప్ జాబితాలు

**తోట్లవల్లూరు:** రబీ సీజన్‌లో మండల వ్యాప్తంగా 7678 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు చేశామని మండల వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 4తో ఈ క్రాప్ నమోదు గడువు ముగిసినట్లు పేర్కొన్నారు. ఈ క్రాప్ నమోదుకు సంబంధించిన ముసాయిదా జాబితాలను ఈ నెల 17 వరకు అన్ని గ్రామాల పరిధిలోని రైతుభరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శనకు ఉంచినట్లు చెప్పారు. జాబితాలో తప్పొప్పులు ఉంటే తమకు తెలియజేస్తే లోపాలను సరిచేస్తామని పేర్కొన్నారు. అలాగే గ్రామసభలు కూడా నిర్వహిస్తామన్నారు. రైతులు తమ అభ్యంతరాలు తెలియజేస్తే వెంటనే సరి చేయటానికి అవకాశం ఉంటుందన్నారు.

### కాలువ తవ్వకం పనులు ప్రారంభం

**మండవల్లి:** మండలంలోని పెనుమాకలంక గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా పంట కాలువ తవ్వకం పనులు సోమవారం నిర్వహించారు. ఎంటీఏ నవీన్ మాట్లాడుతూ రూ.78 వేలు నిధులతో పంట కాలువ తవ్వకం పనులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 56 మంది కూలీలు పనులు నిర్వహించినట్లు తెలిపారు.

### ఇంటింటికీ ఫీవర్ సర్వే

**మండవల్లి:** మండలంలోని అన్ని గ్రామాల్లో మూడో రోజు ఇంటింటికీ వెళ్లి ఏఎన్‌ఎంలు ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.అనీల సోమవారం పేర్కొన్నారు. ఫీవర్ సర్వేలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు పాల్గొంటున్నారని చెప్పారు.

### చెరువుల తవ్వకాలపై స్పందనలో ఫిర్యాదు

**ముదినేపల్లి రూరల్:** గ్రామంలో చెరువుల తవ్వకాలు నిలిపివేయాలని పలువురు రైతులు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. మండలంలోని ఊటుకూరులో పంట భూములను రొయ్యల చెరువులుగా మార్పు చేస్తున్నందున అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని స్థానిక సచివాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. చెరువుల తవ్వకాల వల్ల మిగిలిన భూములు చవుడుబారుతూ పంటలు పండడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నీరు కలుషితమై పశువులు తాగేందుకు పనికిరాకుండా పోతున్నట్లు ఆరోపించారు. ఇప్పటికే ఉన్న చెరువులను ధ్వంసం చేయడంతో పాటు కొత్త చెరువుల తవ్వకాలకు అనుమతులు ఇవ్వరాదంటూ రెవెన్యూ అధికారులను ఫిర్యాదులో కోరారు. కుర్మా రాజప్రకాష్, కే గోపి, ముత్యాల రామ చంద్రమూర్తి, పత్తి నాగరాజు తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

### అభ్యంతరాలు తెలపాలి

**కై కలూరు:** ఈ-క్రాప్ నమోదుకు రైతులు అభ్యంతరాలను తెలియచేయాలని కైకలూరు మండల వ్యవసాయాధికారి ఎం.దివ్య చెప్పారు. వేమవరప్పాడు ఆర్‌బీకే కేంద్రంలో 2022-23 ఈ క్రాప్ పంట నమోదు వివరాలపై గ్రామ సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ అభ్యంతరాలను రైతులు రాతపూర్వకంగా వ్యవసాయాధికారులకు తెలిచపర్చాలన్నారు. సర్పంచ్ నున్న రాంబాబు, ఉప సర్పంచ్ జాజుల రాజు, వీఏఏ గోపి, రైతులు హాజరయ్యారు.

### విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నిక

**పెడన:** రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల యూనిట్ నూతన అధ్యక్షుడుగా మట్టా రాధాకృష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు రాజేంద్రప్రసాద్, ఆశీర్వాదం, ఎ.శంకరరావు సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా మట్టా రాధాకృష్ణమూర్తిని, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.ఫణిభూషణరావు, కార్యదర్శిగా వైకేఎస్ మల్లయ్య, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ హామీద్, ఎంఏ ఆలీం, వి.త్రిపుర సుందరిని ఎన్నుకున్నారు.



# తాగునీటి సమస్యలు తక్షణం పరిష్కరించాలి

**కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్**

**కైకలూరు(కలిదిండి):** వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలను అధికారులు తక్షణం పరిష్కరించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదేశించారు. కొండూరు గ్రామంలో 190వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి ముందుగా నివాళి అర్పించారు. అనంతరం మూడున్నరేళ్ళలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధి వివరాలతో కరపత్రాలను ఆయా కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా ప్రజలు గ్రామంలో అంతర్గత రహదారులు, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులను సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. తర్వాత గ్రామంలో నూతన తాగునీటి పైప్ లైన్‌ను ప్రారంభించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, వైస్ ఎంపీపీలు కనకదుర్గా రాణి, నాగలక్ష్మి, సర్పంచ్ బొర్రా వెంకటలక్ష్మీ, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గద్దె ఆనంద్ కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, నాయకులు కందుల వెంకటేశ్వరరావు, గరికముక్కు జాన్ విక్టర్, వాసిపల్లి రత్నమణి, ఊర శ్రీధర్, చిట్టూరి బుజ్జి, మెండం రాజు, ముంగర ఏడుకొండలు, తిరుమలశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


కలిదిండి మండలం కొండూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

# సమన్వయంతో వేగంగా అభివృద్ధి పనులు

**ఎమ్మెల్యే డీఎన్నార్**

**కై కలూరు:** గ్రామాభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ముందుగా ఎంపీపీ మండల ప్రగతిని వివరించారు. మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు వేగంగా చేయాలని సూచించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ కైకలూరు మండలంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయా సచివాలయాలకు రూ.4.40 కోట్లు కేటాయించామని చెప్పారు. విద్యుత్ స్తంభాల నిమిత్తం మరో రూ.50 లక్షలు అందించామని తెలిపారు. మండలానికి వివిధ పనులు నిమిత్తం రూ.9 కోట్ల నిధులు ఇచ్చామని వెల్లడించారు. మార్చి చివరి నాటికి గ్రామాల్లో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష చేశారు. కై కలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి కై కలూరు కాల్వకు ఎగువ ప్రాంతాల నుంచి కళేబరాలు వస్తున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. పందులు, పశువుల సంచారాన్ని నిరోధించడానికి అధికారులు సహకరించాలని కోరారు.

వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భత్రాజు శివాజీ, ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు నల్లగచ్చు ధనలక్ష్మి, మూడెడ్ల శశికళ,తమ్మిశెట్టి లక్ష్మీ, పట్టపు బాలమ్మ, గాంధీప్రసాద్, పెన్మెత్స సూర్యనారాయణ రాజు, సైదు లక్ష్మీ, మండల కో ఆప్షన్ సభ్యులు సోమల శ్యామ్ సుందర్, సర్పంచ్‌లు నున్న రాంబాబు, అల్లూరి మంగారావు, ఉప్పలపాటి నాగమణి, ఉలిసి వసంతకుమారి, దుట్టా మణి, ధర్మరాజుల నాగమణి, గరికిముక్కు మరియమ్మ, జయమంగళ కాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

# విదేశీవిద్యతో ఉన్నత శిఖరాలు

**గుడివాడటౌన్ :** డిగ్రీ పూర్తిచేశాక విదేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఆపై చదువులు అభ్యసిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని చికాగో యూనివర్సిటీ ప్రొఫెసర్ పొట్లూరి దేవీప్రసాద్ తెలిపారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో సోమవారం విదేశీవిద్య ఉపాధి అవకాశాలు అనే అంశంపై పీజీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విదేశాల్లో విద్యనభ్యసించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని చెప్పారు. బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. వాటిని వినియోగించుకుని విదేశాల్లో పరిశోధనా కోర్సులు పూర్తిచేస్తే తిరిగి భారతదేశంలోనే సేవలందించవచ్చన్నారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేఏస్ అప్పారావు, ప్రిన్సిపల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎం.శివనాథ్, విశ్రాంత ప్రిన్సిపల్ ఎస్.శంకర్, ఎంబీఏ విభాగాధిపతి సి.లక్ష్మీనాథ్, వి. నాగేంద్ర కుమార్, బీఎస్ఎస్ పద్మజ పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న పొట్లూరి దేవీప్రసాద్

### ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయండి


శంకుస్థాపలో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

**కై కలూరు:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి గ్రామాల్లో కేటాయిస్తున్న నివేశన స్థలాల్లో ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ఆచవరం గ్రామ హౌసింగ్ కాలనీలో పలు గృహాల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్ ముఖ్య అతిథిగా సోమవారం హాజరయ్యారు. అనంతరం గ్రామంలో పలువురికి ఓటీఎస్ పట్టాలను పంపిణి చేశారు. ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, గోపవరం సర్పంచ్ ఉలిసి వసంత కుమారి, నాయకులు చేబోయిన వీర్రాజు, కరేటి గోవిందరాజులు, బూరుబోయిన శ్రీనివాసరావు, బుర్ల పోతురాజు, మాడపాటి చింతయ్య, సన్నిధి కృష్ణ, ఉలిసి శ్రీనివాసరావు, ధర్మరాజుల సూర్యనారాయణ, కట్టా లక్ష్మయ్య, గృహనిర్మాణశాఖ ఏఈ శేఖర్, పంచాయతీ కార్యదర్శి రవి కిరణ్ పాల్గొన్నారు.

# జావలిన్‌త్రోలో పాలిటెక్నిక్ విద్యార్థి ప్రతిభ

**పామర్రు:** జాతీయ స్థాయి జావలిన్ త్రో విభాగంలో తమ కళాశాల విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానం సాధించారని టీకేఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ తమ్మా భాస్కరరెడ్డి తెలిపారు. టీకెఆర్ కళాశాలలో విజేత అయిన విద్యార్థిని సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా భాస్కరరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని వీఎన్ ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించిన ఆలిండియా సౌత్ జోన్ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్-2023లో తమ కళాశాలలో ట్రిపుల్‌ఈ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి అరక సంజీవ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో జావలిన్ త్రో విభాగంలో ప్రథమ స్థానం సాధించారన్నారు. విజేత అయిన విద్యార్థిని కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్, అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలిపారు.



విజేత అయిన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

# చిన్నారులందరికీ నులి పురుగుల నివారణ మందులు

**తోట్లవల్లూరు:** నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీని విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న పిలుపునిచ్చారు. ఈ విషయమై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రచార పోస్టర్లను సోమవారం ఆమె ఆవిష్కరించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో మంగళవారం నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. 4123 మంది చిన్నారులు, బాల, బాలికలకు వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. శెలవులో ఉన్న విద్యార్థులకు ఈ నెల 18న మందులు వేస్తామని పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బంది మాణిక్యం, రోహిణి, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


తోట్లవల్లూరులో పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సాయిప్రసన్న, సిబ్బంది

### నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

**పెడన:** పట్టణంలోని పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ఇందిరా కాలనీలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని పెడన క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధి, క్రైస్ట్ ఆఫ్ ఛర్చి నిర్వాహకులు కె.చంద్రమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు ఆశ్రమ ఆసుపత్రికి చెందిన వైద్యులచే ఈ ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.

# ఉచిత కుట్టు శిక్షణకు అవకాశం

**పెడన:** కృష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలకు, యువతులకు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక శివాంజనేయ స్టడీ సెంటరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 20వ తేదీన దివంగత మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కుట్టు శిక్షణ అనంతరం కంప్యూటర్ శిక్షణ కూడా ఉంటుందన్నారు. పెడన నియోజకవర్గం పూర్తవ్వగానే మరొక నియోజకవర్గంలో ప్రారంభించి అన్ని నియోజకవర్గాల్లో పూర్తి చేస్తామన్నారు. శిక్షణ పొందాలనుకునేవారు 9949732847, 7674080156 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో పెడన రిజిస్టర్ ఆఫీసు పక్కనే ఉన్న శివాంజనేయ స్టడీ సెంటరులో అయినా నేరుగా సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణాజిల్లా బీసీ సంక్షేమ సంఘం మహిళా ఉపాధ్యక్షురాలు కుర్షిద్‌బేగం, జిల్లా, పెడన నియోజకవర్గ, మండల నాయకులు బొర్రా కాశీవిశ్వేశ్వరరావు, గూడవల్లి కృష్ణార్జునరావు, వీరంకి శ్రీనివాసరావు, కాగిత సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ తదితరులు

### చిట్టి పిళ్లారయ్యకు పూజలు

**మచిలీపట్నంటౌన్:** నగరంలోని బుట్టాయిపేటలో వల్లభాంబ సమేత మహాగణపతి పంచాయతన క్షేత్రంలో శ్రీ చతచండీ సహిత శ్రీ మహారుద్ర యాగం అష్టమ వైభవోత్సవాలు రెండో రోజైన ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా స్వామివారికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ గణపతి పూజ, మహన్యాస పూర్వక మహారుద్రాభిషేకములు, శ్రీ మహారుద్ర యాగం, శ్రీ శతచండీ యాగం ప్రారంభించారు. ఋత్విగ్వరణము, దీక్షాధారణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అగ్నిమందన, అగ్నిప్రతిష్టాపన కార్యక్రమం చేశారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ భక్తబృందం పర్యవేక్షించింది.

### వీరాంజనేయుని హుండీ ఆదాయం రూ.5.42లక్షలు



**పామర్రు:** ఉంద్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.5.43,544 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్.సత్యవతి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో హుండీలను సోమవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 60 రోజులుగా భక్తులు కానుకలుగా హుండీలో వేసి వాటిని లెక్కిస్తున్నామని చెప్పారు. ఈ లెక్కింపును దేవదాయ ధర్మాదాయ శాఖ గుడివాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ సమక్షంలో నిర్వహించామని పేర్కొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మట్టా పూర్ణచంద్రరావు, ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు , భక్తులు పాల్గొన్నారు.

### ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

**ముదినేపల్లి రూరల్:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 15 నుంచి నిర్వహించే ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాస్మిన్ తెలిపారు. కళాశాలలోని పరీక్షా కేంద్రం ద్వారా పలువురు విద్యార్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు. ఈ కేంద్రంలో ఇంటర్ మొదటి సంవత్సరం 236 మంది, ద్వితీయ సంవత్సరం 229మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. ఇందుకోసం 12 గదులను సిద్ధం చేయడంతో పాటు 13మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు చెప్పారు.

### ఆకట్టుకున్న గరికపాటి ప్రవచనం



**మచిలీపట్నంటౌన్:** స్థానిక బుట్టాయిపేటలోని చిట్టిపిళ్లారయ్యస్వామి దేవస్థానంలో శ్రీ శతచండీ సహిత శ్రీ మహారుద్రయాగం అష్టమ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి మహా సహస్రావధాని బ్రహ్మశ్రీ గరికపాటి నరసింహారావు చెప్పిన ప్రవచనాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. శ్రీ శంకరాచార్య రచించిన మూక పంచశతి అంశంపై చెప్పిన ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. మంగళ, బుధవారాల్లో కూడా గరికపాటి నరసింహారావు ప్రవచనాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ శంకరాచార్య రచనల్లోని పలు అంశాలను వివరించారు.

# సమస్యల పరిష్కారానికే స్పందన

**గుడివాడటౌన్:** ప్రజల సమస్యలు సత్వర పరిష్కారానికే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆర్డీవో పి.పద్మావతి తెలిపారు. కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజలు తమ అర్జీలు అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో పద్మావతి మాట్లాడుతూ స్పందనలో సమస్యలను విన్నవిస్తే తక్షణమే పరిష్కారం ఉంటుందన్నారు. సమస్యను బట్టి నెలలోపు పరిష్కారం చూపడం లేదా పరిష్కారమార్గం చెబుతామని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ పద్మావతి

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

**గుడివాడటౌన్:** పురపాలక సంఘ పరిధిలో పారిశుద్ధ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ తెలిపారు. మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశం హాలులో సోమవారం పారిశుద్ధ్య, ఆరోగ్య, ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలో దోమలు నివారించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి వెళ్లి జ్వరం పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అంటువ్యాధులు సోకకుండా అవగాహన కల్పించాలన్నారు. జ్వరాలు తదితర పరీక్షలు నిర్వహించిన వివరాలను వారి లాగిన్‌లలో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాపై తనిఖీలు పెంచాలని క్లోరినేషన్ పరీక్షలు ఎక్కువ నిర్వహించాలన్నారు. లీకులను వెంటనే అరికట్టాలని, మురుగు కాల్వల్లో పూడికలు తీయాలని కోరారు. మున్సిపల్ ఇంజినీర్, డీఈఈ, అసిస్టెంట్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కమిషనర్

# కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

**ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్**

**పామర్రు:** అధికారులు సమన్వయంతో ఉంటూ విధులు నిర్వహించాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమావేశానికి వచ్చే సమయంలో పూర్తి స్థాయి సమాచారంతో రావాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ఆయా గ్రామాల్లో ఎంపీటీసీలతో సమన్వయమై సమస్యలు పరిష్కరించాలని సూచించారు. జగనన్న కాలనీ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ఏమైనా ఇబ్బందులుంటే వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇంకా గృహ నిర్మాణాలు చేపట్టాల్సిన వారు ఉంటే వారి వద్దకు వెళ్లి అవగాహన కల్పించి నిర్మించుకునేలా కృషి చేయాలన్నారు. రానున్న వేసవి కాలంలో ఎక్కడా కూడా తాగునీటికి ఇబ్బందులు పడకుండా తగు విధమైన జాగ్రత్తలు వహించాలన్నారు. వాటర్ ట్యాంక్‌లను ఎప్పటి కప్పుడు కడిగిస్తూ వాటిలో బ్లీచింగ్ తదితరాలను కలపాలని తెలిపారు. తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎంపీడీవో వై. రామకృష్ణ, ఎంపీటీసీలు టి.శ్రీనివాసరావు, టి.మహేష్ , పలు గ్రామాల సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

# ప్రకృతి సాగు పద్ధతిపై అవగాహన ర్యాలీ

**నిమ్మకూరు(పామర్రు):** నవ ధాన్యాల సాగు పద్ధతిపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్కూల్ పిల్లలతో కలిసి అవగాహన ర్యాలీ సోమవారం నిమ్మకూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెడ్‌మాస్టర్ లక్ష్మీ లత మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు మోతాదుకి మించి రసాయనాలను వినియోగించి పంటలను పండిస్తున్నారని చెప్పారు. ఈ రసాయన అవశేషాలు ఉన్న ఆహారాన్ని భుజించి అనారోగ్యానికి గురైతున్నామని పేర్కొన్నారు. రసాయనాల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయవిధానంలో సహజ సిద్ధమైన పంటలు పండించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ రామమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రబీ పంట తర్వాత భూమిని బీడుగా ఉంచకుండా 365 రోజులు పంటల సాగు విధానం అనుసరించాలని పేర్కొన్నారు. తొలకరి వర్షాల కంటే ముందే 32 రకాల పచ్చి రొట్ట విత్తనాలతో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ విధానంలో విత్తిన గుళికలు తయారు చేసి పశువుల మేతగా ఉపయోగించుకోవచ్చన్నారు. దేవ చంద్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


నిమ్మకూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విద్యార్థులు

# బాలల కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలి

**కై కలూరు:** సచివాలయాల్లో బాలబాలికల కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని సచివాలయాల శాఖ, సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం జిల్లా కో- ఆర్డినేటర్ టీఎస్.స్నేహన్ చెప్పారు. కై కలూరు సచివాలయంలో సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు సచివాలయ పరిధిలోని 18 ఏళ్ల లోపు బాలబాలికల పేర్లు రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కాలేజీలు, బడియట పిల్లలు ఇలా విడివిడిగా సమాచారాన్ని సచివాలయ సిబ్బంది సేకరించాలని తెలిపారు. జిల్లా పరిషత్ ఓరియంటల్ స్కూల్‌లో రక్తహీనత-బాలల వివాహాల నిర్మూలన అనే అంశంపై బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సచివాలయం కార్యదర్శి ఎం.కళావతి, మహిళా పోలీసు సీహెచ్ ఉమాసాయి, ఏఎన్‌ఎం . వై.రజనికుమారి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వీఎన్ వి.శ్యామల, సంక్షేమ కార్యదర్శి వి.వసంత్ కుమార్, హెచ్‌ఎం విష్ణుమూర్తి పాల్గొన్నారు.


అవగాహన కలిగిస్తున్న జిల్లా కో- ఆర్డినేటర్ టీఎస్ స్నేహన్